## సీఎంకు సింగరేణి రిటైర్డ్ కార్మికుల ఉత్తరాలు



మాట్లాడుతున్న సింగరేణి రిటైర్డ్ కార్మికులు

శ్రీరాంపూర్, జూన్ 26 : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి సింగరేణి రిటైర్డ్ కార్మికులు ఉత్తరాలు పంపినట్లు సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దండంరాజ్ రాంచందర్‌రావు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి అళవందార్ వేణుమాధవ్ పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్ ఈసీఐఎల్‌లో సింగరేణి రిటైర్డ్ కార్మికుల సమావేశం నిర్వహించారు. తెల్లరేషన్ కార్డు, ఆసరా పింఛన్ మంజూరు చేయాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉత్తరాలు పంపించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భూపెల్లి బానయ్య, కార్యదర్శి సామంతుల నర్సింగ్‌రావు, సలహాదారు టీ ఉమాకర్, నాయకులు పాల్గొన్నారు.

## వివాదాస్పద భూమిపై సర్వే



సర్వే చేస్తున్న రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు

చింతలమానేపల్లి, జూన్ 26 : మండలంలోని కేతిని గ్రామ శివారులో అటవీ భూమిని రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు సంయుక్తంగా బుధవారం సర్వే నిర్వహించారు. ఆశ్రమ పాఠశాల వెనుక ఉన్న సర్వే నం. 17, 18, 19 లోని 7.24 ఎకరాల్లో 70 ఏళ్ల వయస్సున్న విలువైన టేకు చెట్లు ఉన్న భూమి తమదేనని అటవీ శాఖ అధికారులు అంటుండగా, కాదు తమదేనని పట్టాదారులు అంటున్నారు. ఇటీవల ఈ భూమిలో ఉన్న టేకు చెట్లను నరికేందుకు అనుమతి ఇవ్వాలని అటవీ శాఖ అధికారులను పట్టాదారుడు కోరాడు. హద్దులు గుర్తించేందుకు రెవెన్యూ అధికారులకు అర్జీ పెట్టుకున్నాడు. ఆర్ఐ జాఫర్, సర్వేయర్ శ్రీకాంత్, కేతిని ఫారెస్ట్ సెక్షన్ అధికారి సూర్యనారాయణ, బీట్ అధికారి రాజేశ్ పట్టాదార్ తరపున వ్యక్తితో కలిసి సర్వే చేశారు.

# నేతల పుట్టిల్లు బీఆర్‌ఎస్

## రాజకీయ నాయకుల తయారీ ఫ్యాక్టరీగా గులాబీ పార్టీ

- వేల సంఖ్యతో ద్వితీయ.. లక్షల సంఖ్యలో తృతీయ స్థాయి నాయకత్వం
- ఉమ్మడి జిల్లాలో అన్ని స్థాయిల్లోనూ ఎదిగిన నేతలు అనేకం
- కొందరు పార్టీ మారితే నష్టం లేదు.. ప్రత్యామ్నాయానికి కొదవ లేదు..





*రాజకీయ నాయకుల తయారీ ఫ్యాక్టరీగా బీఆర్‌ఎస్ పార్టీ విరాజిల్లుతున్నది. ప్రత్యేక తెలంగాణ సాధనే లక్ష్యంగా ఏర్పడిన బీఆర్‌ఎస్ పార్టీలో ఆది నుంచి కొత్త నాయకత్వం పుట్టుకొస్తూనే ఉన్నది. ఉద్యమ సమయంలో సమైక్య పాలకులు ఎన్ని కుట్రలు చేసినా, ప్రలోభపెట్టి పార్టీ ఫిరాయింపులు చేసినా ప్రత్యామ్నాయం సృష్టించుకుని నిలదొక్కుకున్న పార్టీగా గుర్తింపు ఉన్నది. పార్టీ ఏర్పడిన నాటి నుంచి నేటి దాకా ఎదురుదెబ్బలు తగిలినా ముందుకు వెళ్లడం తప్పా వెనక్కి చూసుకోవడం బీఆర్‌ఎస్‌కు, కేసీఆర్‌కు అలవాటు లేదు. రాష్ట్రం సాధించుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందరో నాయకులు చేరారు. పార్టీ అవసరాలు, ఆ నాయకుల అనుభవంతో పార్టీకి ఉన్న అవసరాన్ని గుర్తెరిగి కేసీఆర్ అందరినీ పార్టీలోకి ఆహ్వానించారు. వీరిలో తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలుపొందిన వారు ఎందరో ఉన్నారు. ఉద్యమంలో పాల్గొన్న నాయకులు, ఉద్యమకారులు, విద్యార్థి, ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాల నాయకుల నుంచి వచ్చిన వారెందరికో గులాబీ పార్టీ అవకాశాలు కల్పించింది. ఇలా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఎంతో మంది నాయకులను తయారు చేసింది బీఆర్‌ఎస్.*

*- మంచిర్యాల, జూన్ 26(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

### నిప్పు కనికల్లాంటి నాయకులు ఎందరో..

తెలంగాణ ఉద్యమంలో చేసిన పోరాటాన్ని గుర్తుంచుకుని విద్యార్థి నాయకుడైన బాల్క సుమన్‌కు సీఎం కేసీఆర్ పెద్దపల్లి ఎంపీ టికెట్ ఇచ్చారు. ఉస్మానియా క్యాంపస్‌లో ఉదయించిన ఆ యువ కిరణానికి రాజకీయ దిశానిర్దేశం చేశాడు. పెద్దపల్లి ఎంపీగా, చెన్నూర్ ఎమ్మెల్యేగా రెండు సార్లు అవకాశాలు ఇచ్చి గెలిపించుకున్నారు. బాల్క సుమన్‌ను వెన్నంటే ఉంచుకుని కాపాడుకున్నారు. ప్రభుత్వ విప్ పదవి ఇచ్చి దళితనాయకుడికి పెద్దపీట వేశారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు కూడా 2014 సంవత్సరంలో ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించింది బీఆర్‌ఎస్ పార్టీయే. పార్టీలో చేరిన తర్వాతనే ఎమ్మెల్యేగా గెలుపొందారు. బోథ్ ఎమ్మెల్యేగా ఉన్న అనిల్ జాదవ్ తన ప్రస్తానాన్ని బీఆర్‌ఎస్ పార్టీలోనే ప్రారంభించారు. జడ్పీటీసీగా ఉన్న యువనాయకుడి కష్టాన్ని గుర్తించి మొన్నటి ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి దగ్గరుండి గెలిపించుకున్నారు. ఖానాపూర్ నుంచి మరో యువ నాయకుడు జాన్సన్ నాయక్‌ను వెలుగులోకి తీసుకొచ్చింది బీఆర్‌ఎస్ పార్టీ. విదేశాల్లో వ్యాపారాలు కలిగిన ఆయనలోకి సేవ భావాన్ని గుర్తించి రాజకీయాల్లోకి ఆహ్వానించింది. ఎన్నో ఏండ్లుగా వెనుకబడిన మారుమూల ప్రాంతంగా, అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఖానాపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశాన్ని ఇచ్చింది. తృటిలో ఓటమి పాలైనా.. ఖానాపూర్ నియోజకవర్గానికి మాత్రం ఓ మంచి నాయకుడిని అందించింది. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మికి బీఆర్‌ఎస్ పార్టీనే పుట్టినిల్లు. ఆమె ఎమ్మెల్యేగా, జడ్పీ చైర్‌పర్సన్‌గా, రెండోసారి ఎమ్మెల్యేగా బీఆర్‌ఎస్ పార్టీ నుంచే గెలుపొందారు. ఆదివాసీ బిడ్డకు రాజకీయ ఓనమాలు నేర్పించి జిల్లాలోనే తిరుగులేని నాయకురాలిగా మలిచింది. ఉద్యమ కాలంలో వెన్నంటి నడిచిన రేణికుంట్ల ప్రవీణ్‌కు ఉద్యమ నాయకుడి హోదాలో పదవులు కట్టబెట్టింది. వీరితోపాటు ద్వితీయ శ్రేణి నాయకులు, వందలాది మందిని బీఆర్‌ఎస్ తయారు చేసింది. ఎన్నిక ఏదైనా టికెట్ విషయానికి వచ్చే సరికి రెండు, మూడు ఆప్షన్లు కలిగి ఉన్న ఏకైక రాజకీయ పార్టీగా తెలంగాణలో తనకంటూ సుస్థిర స్థానం ఏర్పరచుకున్నది.

### పార్టీలు మారేటోళ్లతో నష్టం లేదు..

అధికార దాహం, కనీస నైతిక విలువలు, రాజకీయ చైతన్యం, జనం ఏం అనుకుంటారో అనే ఆలోచన, ప్రజాస్వామ్యం అంటే గౌరవం లేని కొందరు నాయకులకు రాజకీయ భిక్షపెట్టి, సీనియార్టీని గౌరవించి పదవులు, ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చిన తల్లి వంటి పార్టీని వదిలి అధికార పార్టీలో చేరేవారితో బీఆర్‌ఎస్‌కు వచ్చే నష్టం ఏం లేదన్నది సుస్పష్టంగా గోచరిస్తున్నది. ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరే కొందరు నాయకులను పట్టించుకోవాల్సిన అవసరం లేదని పార్టీ అధినాయకత్వం ధీమాగా చెప్పడం వెనక ఓ కారణం ఉంది. పదవులు, అధికారం కోసం పార్టీ మారే వారు పోయినా.. ఉద్యమకాలం నుంచి పార్టీనే నమ్ముకున్న నాయకులు ఇంకా స్థిరంగా బీఆర్‌ఎస్‌లోనే ఉన్నారు. ఇప్పుడు పార్టీ ఫిరాయించిన నాయకత్వానికి ప్రత్యామ్నాయంగా పదుల మంది నాయకులు బీఆర్‌ఎస్‌లో ఉన్నారు. నాయకత్వం లేదని బీఆర్‌ఎస్ ఖాళీ అవుతుందని ఉద్దేశపూర్వకంగా రాజకీయాలే చేసే వారికి సమాధానం చెప్పేందుకు బీఆర్‌ఎస్‌లోని నాయకత్వం సిద్ధంగా ఉన్నది.

## డ్రగ్స్ రహిత సమాజాన్ని స్థాపిద్దాం

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్
- మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవ ర్యాలీ



మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలటౌన్, జూన్ 26 : మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా బుధవారం మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తా నుంచి జడ్పీ బాలుర పాఠశాల వరకు అవగాహన ర్యాలీ తీశారు. ఈ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ వాడితే జరిగే అనర్థాలను విద్యార్థి దశ నుంచే వివరించాలన్నారు. మత్తు పదార్థాల బారిన పడిన వారిని మాన్పించేందుకు ప్రభుత్వ దవాఖానల్లో డీ అడిక్షన్ సెంటర్లలో ఉచితంగా చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఎక్సైజ్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ కే జీ నందగోపాల్ మాట్లాడుతూ ఎవరైనా డ్రగ్స్ అమ్మినా, వాడినట్లు తెలిసినా నార్కోటిక్స్ శాఖ టోల్‌ఫ్రీ నంబర్ 14446కు గానీ, 8712671111 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోతీలాల్, ఏసీపీ ప్రకాశ్, పట్టణ సీఐ బన్సీలాల్, ట్రాఫిక్ సీఐ నరేశ్, ఎక్సైజ్ సీఐ గురువయ్య, డీఐఈవో శైలజ, సంక్షేమశాఖ అధికారి చిన్నయ్య, పలు ప్రభుత్వ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

### మాదకద్రవ్యాలను నిర్మూలించాలి



ర్యాలీ తీస్తున్న ఆసిఫాబాద్ కలెక్టర్, అధికారులు, విద్యార్థులు

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 26 : మాదకద్రవ్య రహిత సమాజం కోసం కృషి చేయాలని ఆసిఫాబాద్ జిల్లా జడ్జి ఎంవీ రమేశ్, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పిలుపునిచ్చారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంలో జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, సీనియర్ సివిల్ జడ్జి యువరాజ, సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్ బాబుతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ యువత 'లవ్, లస్ట్, లిక్కర్'పై అప్రమత్తంగా ఉండాలన్నారు. కోర్టుకు వచ్చే అనేక కేసులు మాదకద్రవ్యాలతో ముడిపడి ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని శాఖల సమన్వయంతో మాదకద్రవ్యాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో తొంబై శాతం నేరాలకు సెల్‌ఫోన్లు, నార్కోటిక్స్ డ్రగ్స్ కారణమని తెలిపారు. సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు మాట్లాడుతూ జిల్లాలోని దహెగాం మండలానికి చెందిన చిన్నారిపై జరిగిన అత్యాచార సంఘటనలో కూడా గంజాయి ప్రభావం ఉన్నదని గుర్తు చేశారు. అనంతరం ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, డీఈవో అశోక్, డీఎస్పీ సదయ్య, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పాతమంచిర్యాల శివారులో ఇసుక డంప్‌లు

## అక్రమంగా ఇసుక డంప్‌లు

- అనుమతి లేకుండా గోదావరి నుంచి తరలింపు
- పాతమంచిర్యాల శివారులో ఎటుచూసినా ఇసుక నిల్వలే

మంచిర్యాలటౌన్, జూన్ 26: మంచిర్యాలలో ఇసుక మాఫియా విజృంభిస్తున్నది. రాత్రికిరాత్రే గోదావరి నుంచి పెద్ద ఎత్తున ఇసుకను అక్రమంగా తరలించి వారికి అనుకూలమైన ప్రాంతాల్లో నిల్వ చేసుకుంటున్నారు. 3 రోజుల వ్యవధిలోనే వందలాది ట్రాక్టర్ల ఇసుక మంచిర్యాల పట్టణం పాతమంచిర్యాల శివారు ప్రాంతాల్లోకి తీసుకువచ్చారు. వర్షాలు కురిస్తే గోదావరిలో నీటి ప్రవాహం పెరిగి ఇసుక దొరకదని భావించిన స్మగ్లర్లు ముందుగానే ఇక్కడికి తరలించారు. వర్షాకాలంలో భవన నిర్మాణ అవసరాలు, ఇతర అవసరాలకు ఇసుక ఉండే డిమాండ్‌ను ముందే పసిగట్టిన ఇసుక మాఫియా పాతమంచిర్యాల సమీపంలోని గోదావరి నుంచి రాత్రి, పగలు తేడా లేకుండా వందలాది ట్రిప్పుల ఇసుకను శివారులోని ఖాళీ ప్రదేశాల్లో నిల్వ చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా గోదావరి నుంచి తీసుకువచ్చిన ఇసుకను వర్షాకాలంలో ఒక్కో ట్రిప్పునకు రూ.3 వేలకు పైగా అధిక ధరకు అమ్ముకుని సొమ్ముచేసుకోవాలన్న ఆలోచనతో ఉన్నారు. పాతమంచిర్యాలలో గోదావరి రోడ్‌లో దాదాపుగా 20 నుంచి 25 ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఇసుక డంప్‌లు ఏర్పాటు చేసుకున్నారు. పట్టణంతో పాటు ఇతర ప్రాంతాలకు ఇసుకను సరఫరా చేస్తారు. ఇంతపెద్ద ఎత్తున ఇసుక దోపిడీ జరుగుతున్నా సంబంధిత శాఖల అధికారులు మాత్రం తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇసుక ట్రాక్టర్ల యజమానులకు వారు కొమ్ముకాస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ దందా వెనుక పెద్దల హస్తం ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు. ఈ విషయంపై జిల్లా మైనింగ్ ఏడీ జగన్మోహన్‌రెడ్డిని వివరణ కోరేందుకు సంప్రదించగా ఆయన అందుబాటులో లేరు.



విర్దండి ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

## విర్దండి ఎత్తిపోతలను పునరుద్ధరించాలి

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**

కౌటాల, జూన్ 26 : కౌటాల మండలంలోని ఎత్తిపోతల పథకాలను పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని సాండ్‌గాం, విర్దండి, గుండాయిపేట, తుమ్మిడిహట్టి ఎత్తిపోతల పథకాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2009 నుంచి ఈ ఎత్తిపోతల పథకాల నుంచి సాగునీరు అందిందన్నారు. ఇటీవల విర్దండి ఎత్తిపోతల మోటర్లు, ఇతర సామగ్రి చెడిపోయాయని, గుండాయిపేట ఎత్తిపోతలలో ఇటీవల దుండగులు మోటర్లకు నిప్పు పెట్టడం, తుమ్మిడిహట్టి ఎత్తిపోతలలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగ చోరీకి గురైనా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. వార్ధా, ప్రాణహిత నదుల్లో పుష్కలంగా నీరున్నప్పటికీ సమీపంలో పంటలు నీరందక ఎండిపోవడం బాధాకరమన్నారు. వెంటనే ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేసి సాగునీరందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులతో కలిసి ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నక్క శంకర్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## కనీస వేతనం ఇవ్వాలి

**మున్సిపల్, పంచాయతీ కార్మికుల ధర్నా**

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 26: కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేందర్, ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట కార్మికులు ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు కనీస వేతనం రూ.26 వేలతో పాటు, ఉద్యోగ భద్రత, బీమా, ఈఎస్ఐ తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు, ఈఎస్ఐ బకాయిలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు కృష్ణమాచారి, గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మోరేశ్వర్, ఆసిఫాబాద్ మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు మాట్ల రాజు, కార్మికులు పాల్గొన్నారు.





కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్, గ్రామ పంచాయతీ కార్మికులు

## గుట్కా విక్రయిస్తే కఠిన చర్యలు

**-ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు**

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 26 : జిల్లాలో గుట్కా విక్రయించే వారిపై కఠిన చర్యలు తప్పవని కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో నిల్వ ఉంచిన రూ.8 లక్షల విలువైన నిషేధిత గుట్కా ప్యాకెట్లను మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కు చెందిన అమిత్ వద్ద గుట్కా ప్యాకెట్లు లభించినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. నిందితుడిని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్, ఎస్ఐ గంగన్న, పీసీ సంజీవ్‌ను అభినందించారు. డీఎస్పీ సదయ్య, పట్టణ సీఐ సతీశ్, ఎస్ఐలు రాజేశ్వర్, ప్రవీణ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..

ప్రకటనల విభాగం...

సెల్: 9182 777 571

మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679